ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు



రాయదుర్గం: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని నిర్వహించిన ముగ్గుల పోటీలు అందరికీ ఆకట్టుకున్నాయి. గోపన్‌పల్లిలోని సెయింట్ జేవియర్స్ పీజీ కళాశాలలో సంక్రాంతి ముగ్గుల పోటీలను శుక్రవారం నిర్వహించారు. ఈ పోటీలను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రమౌళి ప్రారంభించారు. ఎంబీఏ మొదటి, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఈ పోటీలలో ఉత్సాహంగా పాల్గొన్నారు. అందులో ఉత్తమమైన ముగ్గులను గుర్తించి ప్రిన్సిపల్ వారికి బహుమతులను అందించి అభినందించారు.

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

జిన్నారం(పటాన్‌చెరు): కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని గడ్డపోతారం సర్పంచ్ ప్రకాశ్‌చారి సూచించారు. జిన్నారం మండల పరిధిలోని గడ్డపోతారం గ్రామంలో వికసిత్ భారత్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఇందులో భాగంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, వాటిని వినియోగించుకునేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులు ప్రజలకు వివరించారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపల్ పరిధి బీసీ కాలనీలోని 75 సర్వేనంబర్‌లో గల అక్రమ నిర్మాణాలను టౌన్ ప్లానింగ్ అధికారి పవన్ ఆధ్వర్యంలో శుక్రవారం కూల్చివేయించారు. అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

‘భవిత కేంద్రం’... భవిష్యత్తుకు ‘ఆసరా’

- ప్రతి వారం ప్రత్యేకంగా ఫిజియోథెరపీ క్యాంపు
- సెంటర్‌కు రాలేని వారి ఇళ్లకు కూడా వెళ్లి సేవలు
- ‘సమగ్ర శిక్షా అభియాన్’ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు

శేరిలింగంపల్లి: చిన్నారుల మనోభావాలు, అభిరుచులను గుర్తించి, వారి అవసరాలను తీర్చడం, తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇవ్వడానికి ‘దివ్యాంగులకు భవిత కేంద్రం’ ఒక భరోసా కేంద్రంగా మారుతోంది. ఈ కేంద్రం ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు లైఫ్ స్కిల్స్ పెంపొందించడంతో వారి తల్లిదండ్రులకు ఎంతో ఊరటనిస్తోంది. నిత్యం తల్లిదండ్రులు తమకు కలిగిన శారీరక ఇతర లోపాలు ఉన్న చిన్నారులను చూసి మానసిక క్షోభ అనుభవిస్తున్న వారి కోసం ప్రభుత్వం ద్వారా ఈ కేంద్రాన్ని అందుబాటులోకి తెచ్చారు. మానసిక, శారీరక వికలాంగ చిన్నారుల పట్ల కల్పవృక్షంగా శేరిలింగంపల్లి ‘భవిత కేంద్రం’ గుర్తింపును పొందుతోంది. అలాంటి పిల్లల అవసరాలను గుర్తించడంతోపాటు వారి పనులు వారే చేసుకునేలా తోడ్పాటు అందించే లక్ష్యంతో ‘సమగ్ర శిక్షా అభియాన్’ కార్యక్రమంలో భాగంగా దీన్ని ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాన్ని శేరిలింగంపల్లి మండల రీసోర్స్ సెంటర్‌లో ప్రత్యేక అవసరాలు గల పిల్లల వనరుల (భవిత రీసోర్స్ సెంటర్)ఏర్పాటు చేశారు. ఈ కేంద్రంలోని పిల్లలకు తర్ఫీదు ఇవ్వడానికి ఆయా అంశాలలో శిక్షణ పొందిన ఇద్దరు ‘ఇంక్లూజీవ్ ఎడ్యుకేషన్ రీసోర్స్ పర్సన్’ (ఐఈఆర్‌పి)లను నియమించారు. మండల పరిధిలో చెవిటి, మూగ పిల్లలకు స్పీచ్ థెరపీలో భాగంగా తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నారు.



శేరిలింగంపల్లిదివ్యాంగుల భవిత కేంద్రం (భవిత రీసోర్స్ సెంటర్)

అన్ని పనిదినాల్లో అందుబాటులో భవిత రీసోర్స్ సెంటర్...

- ప్రత్యేక అవసరాలు గల పిల్లల వనరుల కేంద్రంలో బుద్ధి మాంద్యం, వినికిడి లోపం, దృష్టి లోపం, నరాల బలహీనత, ఆర్టిజమ్ తదితర 21 రకాలుగా బాధపడుతున్న 6–18 ఏళ్ల వయస్సు ఉన్న చిన్నారులకు లైఫ్ స్కిల్స్ పెంపొందిస్తున్నారు.
- దివ్యాంగులకు తినడం, డ్రెస్ వేసుకోవడం, దువ్వ కోవడం, చిన్న చిన్న పనులు చేయడంతో పాటు కలర్స్ గుర్తించే విధంగా చిన్నారులను తీర్చి దిద్దుతున్నారు.
- ఈ కేంద్రం రోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3.30 గంటల వరకు పనిదినాల్లో పని చేస్తుంది.

కొత్తగా ప్రత్యేక సర్వేతో 309 మంది గుర్తింపు...

- ‘చిల్డ్రన్స్ విత్ స్పెషల్ నీడ్(సీడబ్ల్యూ ఎస్ఎన్) పేరిట ఈ కేంద్రం ప్రతినిధులు 2023 డిసెంబర్ 19వ తేదీ నుంచి శేరిలింగంపల్లి మండల పరిధిలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో సర్వే ప్రారంభించారు.
- రోజు నాలుగు స్కూళ్ళకు వెళ్ళి ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించేందుకు ఈ సర్వే చేపట్టారు.
- ఇప్పటి వరకు శేరిలింగంపల్లిలో 309 మంది చిన్నారులను కొత్తగా గుర్తించారు. వారికి తగిన సలహాలు, సూచనలు, శిక్షణ, ఫిజియోథెరపి వంటివి చేయడానికి ఏర్పాట్లు చేస్తారు.

ఫిజియోథెరఫీ క్యాంపు... ఇతర సేవలు...

- అంగవైకల్యం ఉన్న పిల్లలకు ఫిజియోథెరఫీ క్యాంపును ప్రతి మంగళవారం నిర్వహిస్తున్నారు.
- ప్రత్యేక వైద్యుడితో ఫిజియోథెరఫీకి కోసం 10 మంది వరకు చిన్నారులు హాజరవుతున్నారు.
- ఈ సెంటర్‌కొచ్చే చిన్నారులకు ప్రతి నెలా రూ. 350 చొప్పున ట్రావెలింగ్ అలవెన్స్ అందిస్తారు.
- ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రత్యేక అవసరాలు గల చిన్నారులు (తల్లిదండ్రుల సహాయంతో వచ్చే) ఎస్కార్ట్ అలవెన్స్ కింద నెలకు రూ.350 చొప్పున అందజేస్తారు.
- ప్రతి శనివారం ఈ కేంద్రానికి రాలేని వారి నివాసానికే వెళ్లి వారికి ‘ఐఈఆర్‌పీ’లు శిక్షణ ఇస్తారు.
- అలింకో క్యాంప్ నిర్వహించిన చిన్నారులకు అవసమైన ఉపకరణాలను కూడా అందజేస్తారు.



కేంద్రం చిన్నారులకు లైఫ్ స్కిల్స్ నేర్పిస్తున్న రీసోర్స్ పర్సన్



చిన్నారులకు ఇంటి వద్ద శిక్షణ ఇస్తున్న ఐఈఆర్‌పీ (ఫైల్)



దివ్యాంగులకు ఫిజియోథెరఫీ చేయిస్తున్న డాక్టర్ (ఫైల్)

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

శేరిలింగంపల్లి: గచ్చిబౌలి 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాను శనివారం నిలిపివేయనున్నట్లు నల్లగండ్ల ఏఈ వెంకటనారాయణరెడ్డి తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు 11 కేవీ బాపూనగర్ ఫీడర్ పరిధిలోని ఆదర్శనగర్, బాపూనగర్, గోపీనగర్, నేతాజీనగర్ ఫీడర్ పరిధిలోని గుల్‌మొహర్ పార్కు కాలనీ, నేతాజీనగర్, డాక్టర్స్ కాలనీల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.

హఫీజ్‌పేట్ : హఫీజ్‌పేట్, పాపిరెడ్డి సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ ఫీడర్ల పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు ప్రక్రియలో భాగంగా శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ రాజేందర్ పేర్కొన్నారు.

- మార్కెట్ ఫీడర్ పరిధిలో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి వరకు ప్రేమ్‌నగర్ వెనకాల వైపు, రోలింగ్ మిడోస్, సీఎం తోట వైపు, 100 ఫీట్ రోడ్డు ఇరువైపుల ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.
- ఆదిత్య ఇంపిరియల్ హైట్స్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆదిత్య ఇంపిరియల్ హైట్స్, వినాయకనగర్, ప్రకాష్‌నగర్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ రాజేందర్ తెలిపారు.

వేమన కాలనీ పరిధిలో....

జేటీపీఎల్ సబ్ స్టేషన్ పరిధిలోని 11కేవీ ఫీడర్ల పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు ప్రక్రియలో భాగంగా శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.

- కెపీఎస్‌ఆర్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు కెపీఎస్‌ఆర్ రోడ్డు, రోడ్డు నెంబర్లు 2,4,6,8,9,20,12 తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు.
- పీజేఆర్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పీజేఆర్ రోడ్డు, రోడ్డు నెంబర్లు 1,3,5,7,10,12 తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.
- ఇక్రిశాట్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 02.30 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు ఇక్రిశాట్ ఏరియా, శ్రీరాంనగర్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.
- శాంతినగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు శాంతినగర్, ఉషోదయ అపార్ట్‌మెంట్, పార్కు, దీప్తిశ్రీనగర్ ఏరియా ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

మియాపూర్ : ఆర్‌టీసీ కాలనీ, పీఎస్‌ఆర్ హిల్స్, స్వర్ణపురి కాలనీ, ఫీడర్ మరమ్మత్తుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ రాజ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ఆర్‌టీసీ కాలనీ, శిల్పా లే ఔట్, బాలాజీ లేఔట్, హెచ్‌ఎంటీ కాలనీ, స్వర్ణపురి కాలనీ, పీఎస్‌ఆర్ హిల్స్ అదే విధంగా మధ్యాహ్నం 3 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు హెచ్‌ఎంటీ కాలనీ, స్వర్ణపురి కాలనీ ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు.

‘సండే ఈవినింగ్ టాక్’ కార్యక్రమం

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఆదివారం ‘సండే ఈవినింగ్ టాక్’ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ‘ఫేర్‌వెల్ టు ఫియర్’ అనే అంశంపై సీనియర్ రాజయోగటీచర్, కార్పొరేట్ ట్రైనర్ బికె అంజలి ప్రత్యేక ఉపన్యాసం చేస్తారు. వివరాలకు ఫోన్ నెంబర్ 040–23001234లో సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

హఫీజ్‌పేట్‌లో రామయ్య అక్షింతల వితరణ



హఫీజ్‌పేట్ : హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని ఓల్డ్ హఫీజ్‌పేట్ గ్రామంలో శ్రీ అయోధ్య రామయ్య అక్షింతలు వితరణ శుక్రవారం శ్రీ హనుమాన్ మందిరం నుంచి హనుమాన్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రామభక్తులతో కలిసి బోయిని అనుషా మహేష్ యాదవ్, గ్రామస్తులు కలిసి ఇంటింటికి తిరుగూ అయోధ్య రామయ్య అక్షింతలు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు బోయిని మహేష్ యాదవ్, యాదగిరి గౌడ్, నరేందర్, గౌతమ్, మల్లేష్, జితేందర్, వెంకటేష్, నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బిర్లాప్లానిటోరియంను సందర్శించిన కేవీ విద్యార్థులు



రాయదుర్గం: నగరంలోని బిర్లా ప్లానటోరియంను గచ్చిబౌలి జీపీఆర్‌ఏ క్వార్టర్స్‌లోని కేంద్రీయ విద్యాలయ విద్యార్థులు శుక్రవారం సందర్శించారు. ‘పీఎంశ్రీ ప్రోగ్రామ్’ కింద విద్యార్థులకు జీపీఆర్‌ఏ క్వార్టర్స్‌లోని విద్యాలయ నుంచి ప్రత్యేక వాహనాల్లో ప్లానిటోరియంను చేరుకొని అక్కడి విశేషాలను అడిగి తెలుసుకున్నారు. దాని ప్రత్యేకత వివిధ అంశాలపై తమకున్న సందేహాలను అడిగి తెలుసుకున్నారు.

హెచ్‌సీయూ ప్రొఫెసర్‌కు జార్జ్ వాట్సన్ విజిటింగ్ ఫెలోషిప్



రాయదుర్గం: హెచ్‌సీయూ సీనియర్ ప్రొఫెసర్ వినోద్ పవరాలకు అరుదైన గౌరవం లభించింది. క్వీన్స్‌లాండ్ విశ్వవిద్యాలయంలో 2024 జార్జ్ వాట్సన్ విజిటింగ్ ఫెలోషిప్‌ను పొందారు. బ్రిస్బేన్ లోని స్కూల్ కమ్యూనికేషన్‌లోని స్కూల్ ఆఫ్ కమ్యూనికేషన్ జార్జ్ వాట్సన్ విజిటింగ్ ఫెలోషిప్–2024కు ఆయన ఎంపికయ్యారు.

రక్తదానం అన్ని దానాల కంటే మిన్న

రాయదుర్గం: రక్తదానం అన్ని దానాల కంటే మిన్న అని, యువత రక్తదాన చేయడానికి స్వచ్ఛందంగా ముందుకురావాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్‌యాదవ్ సూచించారు. బీజేవైఎం శేరిలింగంపల్లి నాయకుడు అమర్‌యాదవ్ ఆధ్వర్యంలో రాయదుర్గంలో రక్తదాన శిబిరాన్ని ఆయన శుక్రవారం ప్రారంభించారు. అనంతరం నిర్వాహకులు రక్తదాతలను అభినందించారు.ఆతర్వాత మాట్లాడుతూ ప్రతియేటా ఔత్సాహిక యువత రక్తదానం చేయడంపై ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దని, భయం వీడాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ. బీజేవైఎం రాష్ట్ర, జిల్లా, శేరిలింగంపల్లి నాయకులు, కార్యకర్తలు, పలువురు యువకులు పాల్గొన్నారు.

ఐటీ ఉద్యోగి ఆత్మహత్య

మాదాపూర్: వ్యక్తిగత కారణాల వల్ల ఓ ఐటీ ఉద్యోగి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై బాలరాజ్ తెలిపిన మేరకు.. మాదాపూర్‌లోని సాయినగర్‌లో నివాసం ఉంటున్న జగదీశ్(23) స్నేహితులతో కలసి ఓ గదిని అద్దెకు తీసుకున్నాడు. ఉదయం 9.30గంటలకు తన గదిలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తన స్నేహితుడు బాలకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసును మోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా స్వామి వివేకానంద జయంతి



వివేకానందుడికి నివాళులర్పిస్తున్న బీజేపీ నేత రవికుమార్ యాదవ్

హఫీజ్‌పేట్ : స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని శుక్రవారం హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని మైత్రి కమాన్ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్ యాదవ్ పూలమాల వేసి నివాళ్ళుర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆ రోజుల్లోనే యువకులు సామాజికంగా రాజకయంగా దేశం ఎదుగుదలలో ఎలా ఉపయోగపడతారో చెప్పిన గొప్ప వ్యక్తి స్వామి వివేకానంద అని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు వినోద్ రావు, నాగుల్ గౌడ్, మనోహర్, శ్రీధర్ గౌడ్, మాణిక్ రావు, గణేష్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో....

హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని మైత్రినగర్ కమాన్ వద్ద ఉన్న స్వామి వివేకానంద విగ్రహానికి శేరిలింగంపల్లి నియోజవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి జగదీశ్వర్ గౌడ్ పూలమాల వేసి నివాళ్ళుర్పించారు. కాంగ్రెస్ నాయకులు బాష్పక నాగమణియ, యాదగిరి, సురేష్ నాయక్, సాంబశివరావు, ముకయ్య, సంగా రెడ్డి, వెంకటేస్వామి, రాజన్, యకయ్య, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



మైత్రినగర్ కమాన్ వద్ద నివాళ్ళుర్పిస్తున్న కాంగ్రెస్ నేత జగదీశ్వర్ గౌడ్

పేదల నాయకుడు పీజేఆర్

హఫీజ్‌పేట్ : పేద ప్రజల నాయకుడు మాజీ మంత్రి, స్వర్గీయ పీ.జనార్ధన్‌రెడ్డి అని శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి జగదీశ్వర్ గౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం శేరిలింగంపల్లి, హఫీజ్‌పేట్ డివిజన్ల పరిధిలో పీజేఆర్ జయంతి వేడుకలలో ఆయన పాల్గొన్నారు. పాపిరెడ్డి కాలనీ, గంగారం ప్రాంతాలలోని పీజేఆర్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని ప్రతి పేద ప్రజల గుండెలలో నిలిచిపోయిన వ్యక్తి అని అన్నారు. పీజేఆర్‌తో తమకున్న అనుబంధంతో పాటు ఆయన పేదలకు చేసిన సేవలను గుర్తు చేశారు. రాజకీయంగా ఎదగడానికి ముఖ్య నాయకులు పీజేఆర్ ముఖ్యపాత్ర పోషించారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు జెరిపాటి జైపాల్, మాజీ కౌన్సిలర్ సునీత రెడ్డి, నాయకులు కృష్ణ, కూన సత్యం గౌడ్, వీరేందర్ గౌడ్, కృష్ణ, విక్రమ్, సాంబశివరావు పాల్గొన్నారు.



పీజేఆర్‌కు నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేత ఇంచార్జి జగదీశ్వర్ గౌడ్ తదితరులు

రేగులకుంట చెరువు పరిశీలన

మియాపూర్: చందానగర్ డివిజన్ పరిధిలోని దీప్తీ శ్రీనగర్, రేగులకుంట చెరువు సుందరీకరణ పనులను త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అధికారులకు సూచించారు. డివిజన్ పరిధిలోని దీప్తీశ్రీనగర్ కాలనీలో రేగులకుంట చెరువు సుందరీకరణ పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ సీఎస్‌ఆర్ ఫండ్స్ ద్వారా రూ.కోటి 50 లక్షల రూపాయల నిధులతో ఐటీ కంపెనీ వారు రేగులకుంట సుందరీకరణ పనులు చేపట్టారని తెలిపారు. త్వరలో రేగులకుంట చెరువు దశ దిశ మారనుందన్నారు. ఇరిగేషన్ అధికారులు డీఈ నలిని, ఏఈ పావని, ఐటీ కంపెనీ ప్రతినిధులు చైతన్య, రాము, మాదాపూర్ డివిజన్ అధ్యక్షులు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, బీఆర్ఎస్ నాయకులు తదితరులున్నారు.



దీప్తీశ్రీనగర్‌లోని రేగులకుంట చెరువు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ తదితరులు

భాషా పండితుల సమస్యలను పరిష్కరించండి

కూకట్‌పల్లి: తెలంగాణ రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ అబ్దుల్లా ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర సభాపతి గడ్డం ప్రసాద్‌ను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువా కప్పి, పుష్ప గుచ్ఛం అందజేసి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు విద్యాశాఖలో ఉన్న పలు సమస్యలను ఆయనకు వివరించారు. రాష్ట్రంలో భాషా పండితులు ఉద్యోగం పొంది 20 ఏళ్లు అయినా ఇప్పటి వరకు పదోన్నతులు రాలేదన్నారు. పదోన్నతులకు సంబంధించి ఎన్నో జీవోలు విడుదలయ్యాయని కాని అమలుకు నోచుకోదని తెలిపారు. కొత్త ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుని భాషా పండితులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి వీఎస్ఎస్ శర్మ, చింతల రాజశేఖర్, చిన్న లక్ష్మప్ప, లక్ష్మీనారాయణ, ఎండీ హమీద్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

శిల్పకళావేదికలో పంజాబి లోహరి కార్యక్రమం



మాదాపూర్: మాదాపూర్‌లోని శిల్పకలావేదికలో శుక్రవారం నగరంలో ఉన్న పంజాబీలు లోహరి వేడుకలలో పాల్గొని సరదాగా గడిపారు. ఏటా సంక్రాంతి పండుగ సందర్భంగా పంజాబ్‌లో జరిగే లోహరి పండుగ సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంజాబి మహిళలు ఆటపాటలతో సరదాగా గడిపి సందర్శకులను ఆకట్టుకున్నారు. తెలంగాణ పంజాబి సభ అధ్యక్షుడు తేజ్‌దీప్ కౌర్, రవీందర్ సింగ్ సర్థ పాల్గొన్నారు.

ఘనంగా హిందీ దినోత్సవం

హఫీజ్‌పేట్ : చందానగర్‌లోని మహిళా దక్షత సమితి విద్యాసంస్థల ప్రాంగణంలో ప్రపంచ హిందీ దినోత్సవ కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా బద్రుకా కాలేజ్ ఆఫ్ కామర్స్ అండర్ అర్ట్స్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సుష్మాదేవి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. మన దేశంలో హిందీలో మాట్లాడేవారు, బాషా ప్రాముఖ్యత పెంచేవారు తగ్గరని అన్నారు. భవిష్యత్‌లో ప్రపంచం హిందీమయం అవుతుందన్నారు. అనంతరం ఎండీఎస్ అధ్యక్షురాలు డాక్టర్ సరోజ్ బజాజ్ చేస్తున్న సేవలు కొనియాడారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

మియాపూర్: సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని డాక్టర్ రెడ్డి కాలనీలో అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలో సమస్యలు పరిశీలించి సమస్యలు త్వరగా పరిష్కరించాలని ఈఈ శ్రీకాంతినిని కోరారు. కాలనీలో చేపడుతున్న అభివృద్ధి పనులను నిర్ణీత కాల వ్యవధిలో పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని తెలిపారు. ఆయన వెంట కాలనీ అధ్యక్షులు జ్ఞానశేఖర్, ప్రతాప్‌రెడ్డి, శ్రీకాంత్, భారతి, శివయ్య, స్వామినాయక్, నరేష్ నాయక్ తదితరులున్నారు.

ఇందిరాగాంధీ దేశానికి చేసిన సేవలు మరువలేనివి

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని జగద్గిరిగుట్ట చౌరస్తాలో శుక్రవారం దివంగత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ కాంస్య విగ్రహాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జగదీశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ.. దేశానికి ఇందిరాగాంధీ చేసిన సేవలు మరువలేనివని అన్నారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఎంతో కృషి చేశారని పేర్కొన్నారు. ఇందిరమ్మ రాజ్యం వల్లే తెలంగాణలోని మారుమూల పల్లెల్లో పేదలకు ఇళ్లు వచ్చాయన్నారు. గిరిజనులు, దళితులు, పేదలకు 25 లక్షల ఎకరాల అసైన్డ్ భూములను అందజేసి చరిత్రలో నిలిచిపోయారన్నారు. మెదక్ ఎంపీగా ఎన్నికైన ఆమె గతంలో బీహెచ్‌ఈఎల్, ఆర్డినెన్స్, బీడీఎల్ లాంటి సంస్థలను నెలకొల్పారన్నారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ కొలన్ హనుమంత్‌రెడ్డి, టీపీసీసీ జనరల్ సెక్రటరీ నర్సారెడ్డి భూపతిరెడ్డి, విగ్రహ దాత జెరిపేటి జైపాల్, రఘునందన్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ భానుప్రసాద్, మహిపాల్ యాదవ్, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, సీపీఐ కార్యదర్శి ఏసురత్నం, బాషిపాక నాగమణి తదితరులు పాల్గొన్నారు.

జీఓనెంబర్ 59ను దుర్వినియోగం చేశారు

గచ్చిబౌలి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన జీఓనెంబర్ 59ను కొందరు అధికారులు దుర్వినియోగం చేస్తున్నారని, విచారణ జరిపి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి డిమాండ్ చేశారు. కొంగరకలాన్‌లోని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ శశాంక్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. శేరిలింగంపల్లి మండలం నానక్‌రాంగూడ సర్వేనెంబర్ 149లో ప్రభుత్వ రికార్డుల ప్రకారం 82 ఎకరాల ప్రభుత్వ స్థలం ఉందన్నారు. గత ప్రభుత్వ హాయాంలో పేదల కోసం తీసుకొచ్చిన జీఓనెంబర్ 59ను దుర్వినియోగం చేస్తూ పల్లపు సురేందర్, మాధవిలతతో పాటు మరికొందరు ఎలాంటి ఇళ్ళ నిర్మాణాలు లేకున్నా, విద్యుత్, నల్లా బిల్లుల లాంటివి లేకుండానే దరఖాస్తులు చేసుకొని కొట్ల రూపాయల విలువల చేసే ప్రభుత్వ స్థలాన్ని పొందారన్నారు. ఎలాంటి విచారణ లేకుండానే ప్రభుత్వ స్థలాలను కట్టబెట్టిన అప్పటి తహశీల్దార్ శ్రీనివాసరావు, సీనియర్ అసిస్టెంట్ ఫ్రాంక్లిన్, ఇతర అధికారులపై విచారణ చేసి శాఖాపరమైన చర్యలు తీసుకోవడంతోపాటు క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

ఆకట్టుకున్న ‘పాటరీ మేకింగ్’ వర్క్‌షాప్




రాయదుర్గం: విద్యార్థులను చదువుతో పాటు ఇతర రంగాలలో రాణించేలా చేయడంలో కేంద్రీయ విద్యాలయాలు ఎంతో కృషి చేస్తున్నాయి. అందులో భాగంగా పీఎంశ్రీహ్యాండ్స్ కార్యక్రమం కింద ‘పాటరీ మేకింగ్ వర్క్‌షాప్’ను శుక్రవారం గచ్చిబౌలి జీపీఆర్‌ఏక్వార్టర్స్‌లోని కేంద్రీయ విద్యాలయలో నిర్వహించారు. ఈ సందర్భంగా కుండల తయారీలో నిష్ణాతుడైన జయప్రకాశ్ వావిలాల ఆధ్వర్యంలో విద్యాలయలో 6వ తరగతి ఏ,బీ,సీ సెక్షన్లకు చెందిన 150 మంది విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. మట్టితో వివిధ ఆకృతులను తయారీ చేసి విద్యార్థులకు ఆయన చూపించారు. అనంతరం విద్యార్థుల చేత కూడా మట్టితో వివిధ ఆకృతులను తయారు చేసేలా ఆయన ప్రోత్సహించారు. ప్రిన్సిపల్ జితేంద్రకుమార్ ఆర్ట్ టీచర్ శివకుమార్‌తో కలిసి ప్రారంభించారు.

అలరించిన కూచిపూడి నృత్యప్రదర్శన



మాదాపూర్: మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న గాంధీ శిల్ప జతీయమేళా సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటుంది. మేళాలో భాగంగా శుక్రవారం సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా శ్రీగాయత్రీ నృత్య కళాక్షేత్ర గురు వైష్ణవి శిష్యబృందం కూచిపూడి నృత్య ప్రదర్శనతో సందర్శకులను ఆకట్టుకున్నారు. ఇందులో వినాయకకౌత్వం, అమ్మనీరాజనం, కృష్ణకలయసఖీ, మహాగణపతిం, జతిస్వరం, ముద్దుగారే యశోద తదితర అంశాలను ప్రదర్శించి అలరించారు. కళాకారులు హరిచందన, ఆద్విక, విహారిణి, భార్గవి, తపస్య, ఆరాధ్య, కీతిశ్రీ తదితరులు ప్రదర్శించి అలరించారు.

రోడ్డు పనులు నిలిపివేత



శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి డివిజన్ హుడా ట్రేడ్ సెంటర్ కాలనీలోని రామాలయం వెనుక రోడ్డును జీహెచ్‌ఎంసీ రోడ్డు వేసేందుకు పనులు చేపట్టగా హెచ్‌ఎండీఏ సిబ్బంది నిలిపివేశారు. శుక్రవారం రోడ్డు పనులు చేస్తుండగా హెచ్‌ఎండీఏ స్థలంలో రోడ్డు వేయద్దంటూ సిబ్బంది పనులను ఆపారు. ఆ రోడ్డులో ఉన్న టీమ్ అబాడ్ అపార్టుమెంట్ వాసులు మాత్రం అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఏడు నెలల క్రితం రోడ్డు వేస్తుంటే దేవాదాయ శాఖ అధికారులు ఆ స్థలం తమదేని పనులను నిలిపివేశారన్నారు. ప్రస్తుతం హెచ్‌ఎండీఏ అధికారులు తమదంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అపార్టుమెంట్‌లో 50 కుటుంబాలు నివసిస్తున్నాయని పేర్కొన్నారు. ఏదైనా సమస్య ఉంటే జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ అధికారులు మాట్లాడి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. రోడ్డు పనులు యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు.